# ఇష్టం

## ముద్దంశెట్టి హనుమంతరావు

రంగు రంగు విద్యుద్దీపాల కాంతిలో, ఆ పరిసరాలు దేదీప్యమానంగా మెరిసి పోతున్నాయ్. లౌడు స్పీకర్లకు శ్రావ్యమైన సినిమా పాటలు, వీనుల విందుగా వినిపిస్తున్నాయ్. బైట గేటు దగ్గర్నించి, కళ్యాణ మండపం వరకూ, చిన్న రంగు బల్బుల తోరణాలు వేలాడుతూ, వింత శోభనం తెచ్చి పెట్టినయ్. ఆ ప్రాంగణమంతా కార్లూ, మోటారు సైకిళ్ళూ, స్కూటర్లతో నిండి పోయింది.

ఆ ప్రాంగణంలోని హడావిడి, హంగామా చూస్తు ఉంటే, ఎవరిదో గొప్పింటివారి వివాహమని అనిపించక పోదు.

వివాహ ముహూర్తం, రాత్రి రెండు గంటల నాలుగు నిముషాలకు నిశ్చయించడం మూలాన, ఇప్పుడొచ్చిన వాళ్ళంతా ఇంత వరకూ ఉండి వధూ వరుల్ని ఆశీర్వదిస్తారన్నది, సందేహాస్పదమే! అలా ఉండేవారు తక్కువే. సన్నిహిత బంధువులు, సన్నిహిత స్నేహితులు మాత్రమే ఉంటారు.

విందు భోజనాలు ముగించి, చాలా మంది వెళ్ళిపోతున్నారు. వెళ్ళే ముందు, వధూవరులను ఆశీర్వదించి వారికి ఇవ్వాల్సిన బహుమతులుగాని, చదివింపులు గాని, ఇప్పుడే అందజేసి వెళ్ళడం రివాజు.

వరుడి తరపు వారిద్దరు, అటువంటి చదివింపులను తీసుకోడానికి, ఓ చోట ప్రత్యేకంగా టేబులు వేసుకుని కూర్చున్నారు. అయితే, వధువు తరపునుంచి మాత్రం అటువంటి ఏర్పాటేమీ లేదు. వధువు తండ్రి, రామలింగస్వామే అటువంటి చదివింపులు స్వయంగా తీసుకుంటున్నాడు. వస్తురూపేణా వచ్చిన వాటిని భార్య దగ్గరికి పంపించేస్తున్నాడు.

స్నేహబృందంతో కళ్యాణ మండపం హాల్లో ఓ మూల కూర్చుని, పిచ్చాపాటి కొడుతున్న వరుడు దాసు, రామలింగస్వామిని గమనిస్తూనే ఉన్నాడు. మావగారు డబ్బు మనిషని అప్పుడే గ్రహించేశాడు దాసు.

రాత్రి రెండు గంటల నాలుగు నిముషాలకు వివాహం జరిగిపోయింది. ఏ కొద్ది మందో ఆహ్వానితులు అప్పటి వరకూ ఉండి వధూవరుల్ని ఆశీర్వదించారు. ఏ విధమైన గొడవలూ లేకుండా, వివాహం సాఫీగా జరిగి నందుకు, దాసు ఎంతో ఆనందించాడు. ఆ మేరకు మామగారిని అభి నందించాడు.

* * *

అత్తవారింట్లో ఉన్న మూడు రోజులూ హాయిగా గడిచి పోయింది. దాసుకి ఓ వి.ఐ.పికి ఇచ్చే ట్రీట్‌మెంట్, అతనికి లభించిందంటే, అతి శయోక్తి కాదు. అతనికి అర్థంకాని విషయం మాత్రం ఒకటుంది. మామగారు పెద్ద ఉద్యోగేం కాదు. సామాన్య ఉద్యోగే. అటువంటి వ్యక్తి ఇంత విచ్చల విడిగా ఖర్చు పెడుతున్నాడూ అంటే, స్వతహాగా అతను డబ్బున్న వాడయ్యుండాలి. లేదా డబ్బు సంపాదించే అవకాశాలయినా ఉండి ఉండాలి. అనుకున్నాడు.

ఓనాడు రాత్రి భార్యను అడిగాడు దాసు.

“దీప్తీ, నువ్వు మరేమీ అనుకోనంటే, ఓ ప్రశ్న వేస్తాను...” అని.

“అడగండి.”

“మీ నాన్నగారు చేస్తున్న ఉద్యోగం ఏమిటి!”

“ఏదో ఇన్‌స్పెక్టర్ ఉద్యోగమండీ. ఎందుకలా అడుగుతున్నారు.”

“మన పెళ్ళికి మీనాన్నగారు బాగానే ఖర్చు పెట్టారు. ఆస్తి పాస్తులు బాగా ఉండి ఉండాలి. ఔనా!”

“అబ్బే! ఆస్తులేమీ లేవండీ” అమాయకంగా చెప్పింది.

“అయితే పైరాబడి వచ్చే ఉద్యోగమైన అయ్యుండాలి.”

దీప్తి మొహం చిన్న బోయింది.

“ఏమో, ఆ విషయం నాకు తెలీదండీ!” అంది కాస్తంత నిరుత్సాహంగా.

“దీప్తీ! నేను మరే చెడు ఉద్దేశంతో అనలేదు. నువ్వేమీ బాధపడకు. నీకు మీనాన్నగారంటే, ఎంత గౌరవం, అభిమానం ఉందో, మావగారంటే నాకూ అంతే గౌరవాభిమానాలున్నాయి దీప్తీ. అందుకనే ఆయన అక్రమార్జనకి పాల్పడి, ఎప్పుడైనా చిక్కుల్లో ఇరుక్కోవడం నాకు నచ్చనిది...”

దీప్తి కంగారుగా భర్త మొహంలోకి చూసింది.

“అలాగని, ఆయన్ని నిలదీసి అడుగుతారా?” అంది. అతృతగా, అలా అడిగిన పక్షంలో తండ్రి ఎంత బాధపడతాడో, కృంగి పోతారోనని ఆమె భయం.

నవ్వుగా నవ్వాడు దాసు.

“నేనంత తెలివి హీనుణ్ణి కాను దీప్తీ. ‘నొప్పించక... తానొవ్వక...’ అన్న పద్ధతిలో పరోక్షంగా సూచనలిస్తాను... నిజాయితీగా బతకడంలో, ఎంత హాయి ఉందో, చెబుతాను... అదీ అన్యాపదేశంగానే. నువ్వేమీ కంగారు పడకు...” అన్నాడు దాసు.

దీప్తి, మరేమీ ప్రశ్నించలేదు. “సరే, మీ ఇష్టం...” అంటూ మౌనం దాల్చింది. దాసు చిరునవ్వులు చిందిస్తూ భార్యని తన బాహువుల్లోకి తీసుకున్నాడు.

* * *

దాసు, దీప్తి కొత్త కాపురం ప్రారంభించారు. ఎంతో హాయిగా, ఆనందంగా, సాఫీగా సాగిపోతోంది వారి సంసార జీవితం.

ఓరోజు రామలింగస్వామి కూతురింటికి వచ్చాడు. వేరే పని మీద అటువేపుగా వచ్చాడు. గనక, కూతుర్ని, అల్లుణ్ణీ చూసిపోదామని ఇలా వచ్చాడు.

తండ్రిని చూడగానే ఎంతగానో మురిసి పోయింది దీప్తి. దాసు మావగార్ని సాదరంగా ఆహ్వానించాడు.

“మీరొస్తారని, రోజూ ఎదురు చూస్తున్నాం నాన్నా; అమ్మని తీసుకురాలేక పోయారా?” అంది, దీప్తి.

“మీ ఇంటికి రావాలంటే, ఒక ‘ఊరు’ ప్రయాణ మమ్మా. నేనంటే స్కూటర్ మీద వచ్చేస్తాను. మీ అమ్మ ఇంతదూరం స్కూటర్ మీద రానంటుంది. అదీగాక, వేరే పనిమీద నేను ఇటువేపు వచ్చాను. అలా చూసి పోదామని, మీ

ఇంటికొచ్చాను. నీ మిత్రుణ్ణి కారడిగాను. రెండు మూడు రోజుల్లో, మేమిద్దరం వస్తాంలే." అన్నాడు. రామలింగస్వామి, కూచుంటూనే.

"కూచోండి నాన్నా... ఇప్పుడే వస్తాను..." అంటూ లోపలికి వెళ్ళింది దీప్తి.

"నువ్వు ఇంట్లో ఉంటావో లేదోననుకున్నాను అల్లుడూ... ఓవర్ టైమ్ ఉంటుంది కదా:"

"నేను ఓవర్‌టైమ్‌లూ అవీ చెయ్యను మావగారూ. డ్యూటీ అవ్వగానే, నేరుగా ఇంటికి వచ్చేస్తాను."

విస్తుపోయాడు, రామలింగస్వామి. ఓవర్‌టైమ్ కోసం అందరూ ఎగబడే రోజులివి. కావాలని, కొన్ని సందర్భాల్లో సంబంధిత అధికార్లకి కాకాపట్టి, లేదా ముడుపులు చెల్లించుకుని ఓవర్‌టైమ్ వేయించుకుంటారు కొందరు. అటువంటిది, ఇతనేమిటి ఇలా మాట్లాడుతున్నాడు... అనుకున్నాడు మనసులోనే.



"అదేమిటి బాబూ, ఓవర్ టైము చేస్తే, బాగా గిట్టుబాటు అవుతుంది కదా. ఎంతో మంది కోరి మరీ వేయించుకుంటారట కదా!" అన్నాడు, రామలింగ స్వామి.

దాసు, తేలిగ్గా నవ్వేడు.

"నిజం చెప్ప మంటారా?"

"చెప్పు బాబూ..."


"పేరుకే ఓవర్ టైమ్‌గాని, నిజానికి ఆ సమయంలో ఎవ్వరూ సమంగా పని చెయ్యరు. మావగారూ: అన్నీ దొంగలెక్కలే. అసలు, నిర్ణీత డ్యూటీ సమయంలో ఎవరి పని వాళ్ళు చేసుకుంటే ఈ ఓవర్‌టైమ్‌లు ఎందుకు చెప్పండి? దొంగ లెక్కలు రాసి సంపాదించడమెందుకు, అది, ప్రభుత్వాన్ని మోసగించడం కాదా?... అయినా సరే, చాలామందికి అది అలవాటు, నిజాయితీగా, నీతిగా సంపాదించింది, ఏ కొద్దిపాటి అయినా, అందులోనే తృప్తి, ఆనందం, ఉంటుందని, వాళ్ళకి తెలీదు..." చిన్న ఉపన్యాసమిచ్చాడు.

రామలింగస్వామి మొహం, హఠాత్తుగా పాలిపోయింది. చప్పున మాట్లాడలేక పోయాడు. మావగారిలో అప్పుడే అంతర్మథనం మొదలయ్యిందని గ్రహించిన దాసు, మళ్ళీ ప్రారంభించాడు.

"అంతేకాదు మావగారూ; చాలా మంది అవకాశం ఉంది కదాఅని, అక్రమార్జనకి అలవాటు పడతారు. మేడలు కడతారు. బ్యాంకు బ్యాలెన్సు పెంచుకుంటారు. అయితే, ఈ అలవాటు మొదట్లో చాలా ఆనందంగా ఉన్నా, లంచాలిచ్చే వాళ్ళ, పీడింప బడ్డ వాళ్ళ ఉసురు, శాపనార్థాలు, ఊరికనే పోతాయంటారా? అవన్నీ శాపాలై, ఎప్పుడో ఒకప్పుడు, ఇరకాటంలో పడతారు.

## ఆ ఒక్కడికే





'విరోధి' చిత్రంలో ఆర్మాన్‌కు జోడీగా నటించిన హర్షామెహ్రా ఆ చిత్రంలో అతని ప్రక్కన చాలా ముదురుగా కన్పించిందని పేరు తెచ్చుకుంది. అంతేకాకుండా, ఆ చిత్రం అంతబాగా ఆడలేదుకూడా. బొంబాయి నగరానికి చాలా దూరంగా ఉన్న వాషి అనే ప్రాంతంలో ఉండటంతో హర్షాకు సినిమా వాళ్ళు దూరం అయ్యారు. కానీ ఆమె మాత్రం భజన్, గజల్ సింగర్ అనూప్ జలోటాకు మాత్రం దగ్గరై పోయింది. ఎంత దగ్గరైందంటే "నా బెడ్‌రూమ్‌లోకి డైరెక్ట్‌గా ఎంటర్ అయ్యే వ్యక్తి కేవలం అనూప్ మాత్రమే" అంటోంది హర్షా. అనూప్ అదృష్టమే అదృష్టం.

---

అప్పుడు చింతించి ఏం లాభం? అప్పటికే తరుణం మించి పోతుంది. మనం రోజూ వార్తా పత్రికల్లో చదువుతూనే ఉన్నాం కదండీ. అందుకనే ఈ డబ్బు 'యావ' విషయంలో నేను ఖచ్చితంగా ఉంటాను. "అంటూ ముగించాడు దాసు. అక్రమార్జన విషయం అప్రస్తుతమే అయినా, మావ గారి శ్రేయస్సుకోరి అలా చెప్పాల్సి వచ్చిందతనికి.

రామలింగస్వామి అంతరంగంలో, ఎన్నో ఆలోచనలు గిరున తిరిగినయ్. బహుశా, తన అక్రమార్జన విషయం, అల్లుడికి తెలిసిపోయి ఉంటుందేమో ననుకుని, చిన్న బుచ్చుకున్నాడు. తెలీకపోతే ఆ ప్రస్తావన అప్రస్తుతమే అయినా, పరోక్షంగా ఎందుకలా హెచ్చరిస్తున్నాడు? ఆయన చెప్పిందాంట్లో కూడా తప్పులేదేమో. ఈ అలవాటు క్రమంగా ఎక్కడికి తీసుకుపోతుందో ఎవరికి తెలుసు? దురదృష్ట వశాత్తూ, ఎప్పుడైనా పట్టుబడితే ఎంత అప్రతిష్ఠ? ఇంతవరకూ తాను గడించింది చాలదూ? ఇంక ఎవరికోసం గడించాలి? ఉన్న ఒక్క అమ్మాయికి వివాహం జరిగిపోయింది. ఇంక కావల్సిందేవిటి? ఒకరి ఉసురు, శాపనార్థాలూ తనకెందుకు? ఇప్పటికయినా నిజాయితీ పథంలో పడితే పోలా?... ఇలా సాగినయ్... "ఏమిటి మావగారూ, అలా ఆలోచనల్లో పడ్డారు?" ఆసక్తిగా ప్రశ్నించాడు దాసు. అతనికి తెలుసు... మావగారు యేమాలోచిస్తున్నారో. అయినా, తమాషాకి అడిగాడు.

ఏం జవాబు చెబుతాడు రామలింగస్వామి? పేలవంగా ఓ చిరునవ్వు నవ్వేశాడు. "అబ్బే... ఏమీ లేదు బాబూ. నీవు ఎంత ఉన్నతమైన భావాలో ననుకుంటున్నాను. అంతే."

"దీప్తి టిఫిను తీసుకొచ్చి, తండ్రికీ, భర్తకీ చెరో ప్లేటుతో పెట్టింది.

"ఇప్పుడెందుకమ్మా ఇవన్నీను?" అన్నాడు రామలింగస్వామి. "తీసుకోండి మావగారూ. కూతురింట్లో ఆతిధ్యం పొందడానికి అభ్యంతరం ఉండకూడదండీ:" నన్నగా నవ్వుతూ అన్నాడు దాసు.

"అభ్యంతరమన్ని కాదు బాబూ! అలా తినటం రివాజు. అంతేగా!, తినడం మానేస్తానను కున్నావా?" నవ్వుతూనే అంటూ, టిఫిను తీసుకోడం ప్రారంభించాడు రామలింగ స్వామి.

దీప్తి ముసి ముసిగా నవ్వుకుంటూ లోపలికి వెళ్ళి మంచినీళ్ళు, కాఫీ తీసుకొచ్చింది.

కాఫీ తీసుకున్నాక లేచాడు రామలింగస్వామి. "వెళ్ళొస్తానమ్మా. మీ అమ్మని తీసుకుని వస్తాలే. వస్తానల్లుడూ" అన్నాడు. "మంచిదండీ!"

"నాన్నా, అమ్మని అడిగినట్టు చెప్పండి" అంది దీప్తి.

"అలాగే నమ్మా" అంటూ బైలుదేరాడు.

రామలింగస్వామికి, మనసులో ఉండేది, అమ్మాయి చేతిలో ఓ యాభై రూపాయలు పెట్టాలని. కాని, అల్లుడు ఆ పైకాన్ని తీసుకొనివ్వడేమోనన్న సందేహం, అతణ్ణి ఆ ప్రయత్నం నుంచి ఆపేసింది. బైటికి నిష్క్రమించాడు మౌనంగా.

"అదేవిటండీ, మా నాన్నగారు వస్తే, బాగా మత్తికొట్టి పంపించారు?" అంది దీప్తి భర్తతో.

దాసు మెల్లగా నవ్వేడు."

"అది, మత్తికాదు దీప్తి మీ నాన్నగారికి జ్ఞానోదయం కలిగించాలని, ఆయన్లో మార్పు తేవాలని, చిన్న ప్రయత్నం చేశాను. అంతే!"

"అంటే?" దీప్తికేవీ అర్థం కాలేదు.

"మీ నాన్నగారికి ఉన్న బాధ్యతలేమిటి?"

"నేను ఏకైక సంతానాన్ని నా తల్లిదండ్రులకు. మగ సంతానం లేదు. నా వివాహం జరిపించేశారు కాబట్టి ఇంకే బాధ్యతలున్నాయని? మరేం లేవండీ."

"ఔనా మరి! అయినా... అన్నట్టు, ముందుగా ఓ మాటివ్వు"

"ఏవిటండీ?" ఆశ్చర్యపోయింది దీప్తి.

"మీనాన్నగారి విషయంలో కలిగించు కుంటున్నానని నువ్వేమీ బాధపడవు కదా!"

ఊహూ... ఏం బాధ పడను చెప్పండి"

"అంతా కలుపుకుని ఓ లక్ష ఖర్చు బెట్టి నీకు ఘనంగా వైభవోపేతంగా వివాహం జరిపించారు మి నాన్న. ఔనా?" సూటిగా భార్య మొహంలోకి చూస్తు అన్నాడు దాసు. "ఔనండీ! అయితే?"

"ఇంత డబ్బు ఎలా సంపాదించా రంటావు?"

"ఏమో. నాకేం తెలుసునండీ?" అయోమయంగా అంది.

"ఔన్లే. నీకెలా తెలుస్తుంది. అమ్యామ్యాల ద్వారా సంపాదించారు." "అంటే?"

"అంటే లంచాలు తీసుకుని సంపాదించారన్న మాట..."


దీప్తి మొహం వివర్ణమయ్యింది. ఓ పక్క ఆవేశం వస్తున్నా, బలవంతంగా ఆపుకుంది.

"అవన్నీ మనకెందుకు లెండి..." మొహం ముడుచుకుంటూనే అంది దీప్తి.

"అలా అనకు దీప్తీ! నీకు ఆయన కన్నతండ్రి అయితే, నాకు పిల్లనిచ్చిన మావగారు. ఆయన బాగోగులు, మంచీ చెడులూ, నాకూ అవసరమే. ఆయన్ని ఎవరైనా వేలెత్తి చూపితే, నాగుండెలో బల్లెం గుచ్చుతున్నట్టే ఉంటుంది. అంతేకాదు దీప్తీ! రక్తం రుచి మరిగిన పులి, ఆ రక్తంకోసమే అహర్నిశలూ అన్వేషిస్తుంది. జంతువుల్నీ, మనుషుల్ని చంపుతుంది. అట్లాగే ఈ లంచ గొండితనం కూడాను! దానికి అలవాటు పడిన వారిలో మానవత్వం, మంచితనం, లోపిస్తాయి. నలుగురూ వేలెత్తి చూపడమే కాదు, శాపనార్థాలు పెడతారు. అవన్నీ ఊరికనే పోవుకదా! ఎప్పుడో ఓసారి మీనాన్న పై అధికార్ల ఉచ్చులో పడ్డారే అనుకో? మనందరికీ తలవంపులు కాదా! అందుకే నదుద్దేశంతోనే ఆయన్ని పరోక్షంగా హెచ్చరించాను."

"క్షణం మౌనం దాల్చింది దీప్తి. ఆమె కళ్ళల్లో కన్నీరు పెల్లుబికింది. ఏమీ మాట్లాడలేని స్థితిలో అవనత ముఖియై ఉండి పోయింది.

దాసుకి, భార్య పట్ల జాలి కలిగింది. ఆమె మనోభావాన్ని అర్థం చేసుకో గలిగాడు. దగ్గరగా



వెళ్ళి, చూపుడు వేలితో ఆమె కన్నీరు తుడిచాడు. "బాధ పడనని మాటిచ్చావు. మర్చిపోయావేమిటి! పిచ్చిదానా... మీనాన్నగారంటే, నాకూ అభిమానముంది. గౌరవం ఉంది. అందుకే ఈ ప్రయత్నం..." అన్నాడు, నవ్వుగా నవ్వుతూ.

దీప్తి, భర్త నిజాయితీని మనసులోనే అభినందించుకుంది. అయితే, భర్త పరోక్షంగా అన్న మాటలకి, నాన్నగారు బాధపడ్డారేమోనని ఆమె భయపడింది. "నా నాన్నగారు బాధపడి ఉంటారేమోనండీ?" అంది మెల్లగా.

"మీ నాన్నగారు బాధపడి ఉండరని నా ఉద్దేశం దీప్తి! ఒకవేళ నా ఊహకి భిన్నంగా ఆయన బాధపడితే, ఆయనకి క్షమాపణ చెప్పుకోడానికి నేను ఎప్పుడూ సిద్ధంగానే ఉంటాను" నవ్వుతూ అన్నాడు దాసు.

దీప్తి మరేం మాట్లాడలేదు. "ఏ వ్యక్తి అయినా, నిజాయితీగా, నీతిగా బతకడంలో ఎంతో ఆత్మ సంతృప్తి ఉంటుంది దీప్తి. అప్పుడు నిశ్చింతగా, ప్రశాంతంగా జీవితాన్ని గడపవచ్చు. మీ నాన్నగారిలో ఎటువంటి పరిణామం వస్తుందో, చూద్దాం" అన్నాడు దాసు.

దీప్తి మరేమీ తినకండా అక్కణ్ణించి వెళ్ళిపోయింది. దాసు, ముసి ముసిగా నవ్వుకున్నాడు.

* * *

రెండు నెలల తర్వాత, దాసు దంపతులు రామలింగ స్వామి ఇంటికొచ్చారు ఏదో పండుగ సందర్భంలో.

ఓ రోజు మధ్యాహ్నం భోజనాలయ్యాక, మామగారు, అల్లుడు హాల్లో కూచుని మాట్లాడుకుంటున్నారు. "అల్లుడూ, నీ ఉద్యోగం ఎలా ఉంది?" అన్నాడు రామలింగస్వామి.

"నా ఉద్యోగానికేమండీ! లక్షణంగా ఉంది. అన్నింటికంటే ముఖ్యమైంది. 'సంతృప్తి' మావగారూ! ఆ సంతృప్తి నాకుంది. అందుకే, నేను ఆనందంగా, హాయిగా ఉన్నాను..." అన్నాడు దాసు ఎంతో నిబ్బరంగా.

"నువ్వన్నది అక్షరాలా నిజం అల్లుడూ. ఆనందమయ జీవితానికి, 'సంతృప్తే' అసలు కారణం అనిపిస్తుంది..." అన్నాడు రామలింగ స్వామి.

దాసు, మావగారి మొహంలోకి చూశాడు. "ఆదేమిటి, అలా చూస్తున్నావల్లుడూ?" ప్రశ్నించాడు రామలింగస్వామి. నవ్వేడు దాసు.

"అబ్బే! ఏమీ లేదు మావగారూ! మీ మొహంలో ఏదో కొత్త వెలుగు అగుపిస్తుంటేనూ..."

"ఔనల్లుడూ నాలో ఇటీవల 'సంతృప్తి' కలిగించిన కొత్త వెలుగది" చిరునవ్వుతో అన్నాడు రామలింగస్వామి.

మావగారి మాటల్లోని అంతర్యం అర్థమయ్యింది దాసుకి. తృప్తిగా నవ్వుకున్నాడు తన ప్రయత్నం ఫలించినందుకు, అతని ఆనందానికి అవధుల్లేక పోయాయి.



# ప్రేమపరీక్ష

మీరు నిజమైన ప్రేమికులా? కాదా? అన్నది తెల్సుకోడానికి చిన్న పరీక్ష. ఈ పరీక్షలో పాసైతే మీరు నిజంగా ప్రేమికులే. ఆత్మవంచన చేస్తుకొని మాత్రం సమాధానాలివ్వకండి.

ఇక మొదలు పెట్టండి.

* మీరు ప్రేమించేవారు బాధపడతారని మీరు అమిత మర్యాదగా ప్రవర్తిస్తున్నారా? అవును / కాదు

* మగవారు అయితే అధికారం చెలాయించాలనీ, ఆడవారైతే అణుకువగా ఉండాలని కోరుకుంటున్నారా? అవును / కాదు

* మీరు ప్రేమించుకునే సమయంలో వేరే యువతీ యువకులను పొగడటం తప్పని భావిస్తున్నారా? అవును / కాదు

* మీ సంభాషణలో ఎక్కువ అలంకారాలు, కవిత్వాలు దొర్లుతున్నాయా? అవును / కాదు

* మీరు ప్రేమించేవారి అభిరుచుల్నీ, అలవాట్లనీ ఆసక్తితో గమనిస్తున్నారా? అవును / కాదు

* మీరు అతన్ని/ ఆమెని కలుసుకోవడానికి ఆకర్షణీయంగా తయారై వెళుతున్నారా? అవును / కాదు

* మీ సంభాషణ ఎప్పుడూ మీ ప్రేమ గురించే జరుగుతుందా? అవును / కాదు

* మీ భావాలని మనసులో దాచుకొని ఎదుటివారు చెప్పినదానికి తందానతానే అంటున్నారు కదా? అవును / కాదు

* మీరు ప్రేమిస్తున్నా విషయం మూడోవ్యక్తి ప్రమేయం లేకుండా ఆ వ్యక్తితోనే డైరెక్టుగా చెప్పారా? అవును / కాదు

* స్పర్శ వల్లే ఉత్తేజం పొందుతామని, మాటలవల్ల కాదని మీరు భావిస్తున్నారా? అవును / కాదు

ఇంక పరీక్ష అయిపోయింది. మార్కులు చూసుకోండి.

| | అవును | కాదు |
|---|---|---|
| 1. | 1... | 5 |
| 2. | 1... | 5 |
| 3. | 1... | 5 |
| 4. | 1... | 5 |
| 5. | 5... | 1 |
| 6. | 5... | 1 |
| 7. | 1... | 5 |
| 8. | 1... | 5 |
| 9. | 5... | 1 |
| 10. | 1... | 5 |

## మొత్తం మార్కులు యాభై

మీకు లభించిన యాభై మార్కుల వరకు వస్తే మీరు నిజమైన ప్రేమికులే. నలభై, ముప్ఫై మార్కుల మధ్య వస్తే మీరు కొద్దిగా మీ ప్రవర్తనని మార్చుకోవల్సిన అవసరముంది.

మార్కులు ఇరవై క్రింద వస్తే మీరు నిస్సందేహంగా ప్రేమికులు కాదు. అసలు మీరు మనస్ఫూర్తిగా ఎవరినీ ప్రేమించలేరు.

గొల్లపూడి శైలజ